# సన్మానం

అలమేలు చాలా సంతోషపడి పోయింది. తనకి ఒకానొక మహిళా సంస్థవారు సన్మానం చేస్తామని అన్నందుకు. "ఈ ఏడాది ఆదర్శ మహిళగా మీకు సన్మానం చేస్తాం. ఒప్పుకోండి ప్లీజ్" అనగానే ఇంత లేటు వయసులో ఎగిరిగంతేయడం బాగుండదు కనుక, మహదానందంగా మనసులోనే గంతేసి, తనలో తాను నవ్వేసుకుంటూ అంగీకరించింది. "నాకెందుకండీ నా మొహం ఆదర్శం. నేనేమిటిలెండి" వంటి మొహమాటం ధ్వనులు కూడా చేసింది కొన్ని. అయినా వాళ్ళు బలవంత పెడుతూ "మీ జీవిత విశేషాలు క్లుప్తంగా రాసివ్వండి" అన్నారు. ఎంత క్లుప్తంగా రాద్దామన్నా నాలుగు పేజీలు వచ్చేసింది అది.

ఈ మహిళా సంస్థ వాళ్లు బాగా డబ్బున్న వాళ్ళు. సన్మానం రోజున పొద్దున్నే ఫోను చేశారు. "అలమేలు మేడం. మీరు ఇక్కడికి వచ్చేయండి" అంటుండగానే సన్మానితురాలు గొప్పకు పోయి "నేను వచ్చేస్తాలెండి" అన్నది "అదే చెప్పాలనుకుంటున్నాం. అందరూ బిజీగా వున్నారు. మిమ్మల్ని తీసుకురావడానికి వచ్చేవాళ్లు ఎవరూ కనబడలేదు" అని ఆమె ఖచ్చితంగా చెప్పేసింది. అలా అని ఫోను వాళ్ళే పెట్టేసిన వెంటనే అలమేలు కొడుకు బోలెడు విసుక్కున్నాడు. పాత ఫియట్ కారు తోలుకుంటూ నిన్ను దింపడం, అక్కడ అది ఆగిపోతే ఆ నిర్వాహకులను తోయమనడం ఛండాలంగా ఉంటుందన్నాడు. అలమేలు బిక్కమొహం వేయడం చూసి, సరేలే, నిన్ను దింపేస్తూనే ఇంజను ఆపకుండా గేటు బయటకు వెళ్లి పార్కింగు చేసుకుంటాలే బయలుదేరాలన్నప్పుడు నలుగురు కూలీలను పెట్టో, నలుగురినీ బతిమాలో తోయిస్తాలే" అన్నాడు.

అలమేలు భారీగాను, హుందాగాను, ఖరీదైనదిగాను ఉన్నప్పటికీ సింపుల్‌గా కళాత్మకంగా కనబడే ఒక చీరె కట్టుకుంది. ముద్దుగా మెరిసే పగడాల దండ వేసుకుని కనకాంబరాలు తలలో కొద్దిగా తురుముకుంది. కలర్ ఎఫెక్ట్ కోసం. అది ఉదయం తొమ్మిది గంటల వేళ కనుక, చెమటలు కారకుండా ఉడుకులాం చల్లుకుంది.

1982 మోడల్ తెల్ల ఫియట్ కారు. తోరణాలు కట్టిన గేటులోంచి లోపలకు వెడుతోంటే ఏదైనా ఒక బ్యానర్ మీద ఆదర్శమహిళ అలమేలు గారికి స్వాగతం అని ఉందేమో అన్న చిన్న ఆశతో తల బయటకు పెట్టి చూసింది. అవన్నీ కలర్ టి.వి. వాషింగ్ మెషీన్ల ప్రకటనలు. హాలు ముందు కారు ఆగగానే, ఎవరేనా వచ్చి 'నమస్తే మేడం!' అంటూ ఆహ్వానిస్తారేమోనని చూసింది. దారికి అటూ ఇటూ రంగుల కాగితాలు, వాటి కింద తిరుగుతున్న అలంకృతమైన ఆడవాళ్ళు, బడా వ్యాపారస్తుల్లా సంపన్నత ఉట్టి పడే మొగవాళ్ళు గడ్డాలు పెంచుకుని తెల్ల చొక్కాలతో భారీ కాయాల మగవారు, దారి పక్కన టి.వి.లు కూలర్లు మిక్సీలు వగైరా ఎన్నో ఆధునిక పరికరాలు, బోర్లించిన వాటి అట్టడబ్బాలు.

అమ్మను ఆహ్వానించి తీసుకొని పోయేవారు ఎవరూ లేరని పుత్రరత్నం గుర్తించి 'అమ్మా! దిగు. ఇదంతా లాటరీ, తంబోలా గేమ్ గొడవలా ఉంది. మనకారు భయంకరంగా నల్లని పొగలు వెనక్కి వదులుతోంది. పోలీసైనా చూస్తే ఇక్కడే కాలుష్యం కేసు పెడతాడు. నేరుగా స్టేజి దగ్గరకు వెళ్లిపో. మొహమాట పడకు. నేను అలా రెండు పన్లు చేసుకుని పన్నెండింటికి వస్తాను' అని గబగబా చెప్పి ఆమె కారు దిగగానే, ధామ్మని తలుపు వేసుకుని వెళ్లిపోయాడు.

ఆదర్శమహిళ సన్మాన గ్రహీత అయిన అలమేలు వచ్చిన సంగతి ఎవరికి పట్టినట్లు లేదు. మగవాళ్ళు పోనీ తంబోలా, లాటరీ గొడవల్లో ఉన్నారన్నా ఆడవాళ్లయినా తనని పట్టించుకోవడం లేదు. అటూ ఇటూ వేసిన టేబిల్స్ వాటి చుట్టూ కుర్చీలు, బృందాలుగా కూర్చున్న ఆడవాళ్ల మధ్య నుంచి ముందుకి నడిచింది. ఎవరి గొడవ వాళ్లది. వెళ్లి ఖాళీగా ఉన్న ఒక కుర్చీలో కూర్చుంది. ఈలోగా ఆ కుర్చీ రిజర్వు చేసుకున్న ఆమె వచ్చి.. "ఇది నా సీటు" అంది. అనగానే లేచి నిలబడి వెనక్కు అడుగు వేసింది అలమేలు. ముఖం ఎర్రబడిపోతుండగా. అదృష్టవశాత్తు ఆమె కాలు వెనకగా వస్తున్న మరొకామె కాలు మీద పడి, ఆమె కెవ్వుమంది. అది అలమేలు అదృష్టమని ఎందుకనుకోవాలంటే, తొక్కేసిన ఆ కాలు కలిగిన మహిళ, అలమేలును సన్మానం చేస్తానని ఆహ్వానించిన మనిషి కావడం.

"నమస్కారం... మీరు వచ్చేశారా? గుడ్ కూర్చోండి" అని తన నేస్తాలకు కళ్లతో 'ఈమె చాలా ముఖ్యురాలు' అని సూచించి, ఒక వారగా ఉన్న అదనపు కుర్చీలో కూచో పెట్టింది. అమ్మయ్య పడవలసిన వారి కంట పడ్డాను. ఇంక నాకు గౌరవపరంపరలు దక్కుతాయని, నింపాదిగా అందరి చీరెలు, నగలు, అలంకారాలు, తలలో మేటలుగా వున్న పూలు చూడసాగింది. 'ఆహా, చేనేత పని వారు, వస్త్రాల పరిశ్రమల వారు ఎంత ఊహతో, ఎన్నెన్ని అందాల వలువలు సృష్టిస్తున్నారో కదా!' అని మనసారా మెచ్చుకుంది.

చెవులకి చేటలంత కొన్ని ఆరేసి అంగుళాల పొడవులో, మెడ తిప్పటానికి వీలుకాని మణిహారాలు, వేళ్లమధ్య సందులేకుండా రత్నాల ఉంగరాలు, తల పిన్నులు, చెంపస్వరాలు, మోచేతి వరకు రాళ్ళు పొదిగిన గాజులు, ఒక్కొక్క మనిషి. మనిషి విలువ పక్కన బెడితే, పాతిక లక్షలైనా విలువ చేస్తుందా అని అంచనా వేస్తోంది అలమేలు.

స్టేజి మీద కలకలం ప్రారంభమైంది. మైకులోంచి ఆహ్వానాలు ఆరంభమైనాయి. పట్టపగలైనా గానీ, స్టేజిమీద ఫెళ్లుమని లైట్లు వెలుగుతున్నాయి. ఆ పైన వీడియో వాళ్ల ఫోకస్‌లు. తొమ్మిది కుర్చీలు వేసి ఉన్నాయి. కుచ్చులు కట్టిన పెద్ద టేబుల్ వెనుక, పోషకులు, అధ్యక్షులు, ఉపాధ్యక్షురాండ్రు, కార్యదర్శులు, సహాయకులు వగైరాలను ఒక్కొక్కరిని వరుసగా పిలుస్తోంటే, కరతాళ ధ్వనుల మధ్య వారు వెళ్లి దర్జాగా కూర్చుంటున్నారు. చూస్తుండగానే తొమ్మిది కుర్చీలు నిండిపోయినాయి.

అలమేలు దాదాపు వెర్రి మొహం వేసుకుని చూస్తోంది. ఒక గజం దూరం వెనక్కు మరో వరస కుర్చీలున్నాయి. ఖర్మకాలి తనని అక్కడ కూర్చోమంటారా అని ఆలోచిస్తూ గుటక మింగింది. సరిగ్గా అదే సమయంలో అలమేలును ఆహ్వానించిన మహిళ కళ్ళు ఈమె మీద పడి, ఉలికి పడి, మైకు ముందు ప్రకటన చేస్తున్న ఆమె చెవి కొరికింది. ఆమె వెంటనే 'ఈనాటి ఆదర్శ మహిళ మనం సన్మానించుకుంటున్న అలమేలుగారిని వేదిక మీదకు ఆహ్వానిస్తున్నాం' అనగానే దీపావళి నాడు అర్ధరాత్రి మోగే చెదురుమదురు టపాకాయల్లా కాసిని చప్పట్లు మోగాయి. నేను వెళ్లి ఎవరి ఒళ్లోకూచోవాలి అని ఆలోచిస్తూ అలమేలు స్టేజి మెట్లు ఎక్కుతోంటే... "ఇటు ఇటు" అని అక్కడే ఉంచిన అమ్మవారి ఫోటో పక్కని దీపం సెమ్మె వేపు దారి చూపించారు. అలమేలు చెప్పులు వదిలి, దీపం వెలిగించి భక్తిగా నమస్కారం చేసింది. 'దీపం వెలిగించేప్పుడు చెప్పులు వదలాలి' అని ఒక చిన్న సిద్ధాతం చెప్పగానే ఆ మహిళా మణి ఎంతో మెచ్చుకుంటూ 'ఎంత జ్ఞానం. ఎంత వివేకం' అన్నట్లుగా చప్పుళ్లు చేసింది. ఇతరులు మాత్రం తమ పక్కవారి నగలను క్లోజప్‌లో చూస్తూ ధరలు కడుతున్నారు.

అలమేలు ఎవరి ఒళ్లోనో కూచోవలసిన ప్రమాదం తప్పిస్తూ, ఒక సీటు ఖాళీ చేయించారు. మళ్లీ ప్రకటనల దారు తంబోలా గేమ్సు, నెంబర్లు, వివరాలు, కేకలు, ఒక చిన్న టిన్నులో పోసిన నంబర్లు తిప్పేస్తున్నారు. చీటీలు తీస్తున్నారు. బహుమతులు పంచుతున్నారు. ఒకరినొకరు అభినందించుకుంటున్నారు. చిరునవ్వు ముఖాన తగిలించుకొని అందరి వంకా ఎంతో స్నేహపూర్వకంగా చూస్తోంది అలమేలు. ప్రస్తుత పరిస్థితిలో తన విధి అదే అనుకున్నది.

కాస్సేపటికి కొంచెం అంతరాయంగా కనబడిందేమో – ఆహ్వానించిన మహిళ... 'ఇపుడు సన్మాన కార్యక్రమం' అని ప్రకటించగానే ఉత్సాహం చప్పబడినట్టు అందరూ కార్యకలాపాలు ఆపేసి చూడసాగారు. ఒక కుర్చీ స్టేజి ముందు వేశారు. తనను గురించి అందించిన వివరాలను గబగబా డబల్ స్పీడులో చదివేశారు. ఒక చిన్న సైజ శాలువా, పార్వతీ దేవి ఒళ్లో ఇమిడి పోతున్నట్టున్న చిన్నారి వినాయకుడి బొమ్మ బహుకరించారు. సన్మాన కార్యక్రమం ముగిసింది. పత్రం, పుష్పం, ఫలం,తోయం అన్నారు కదా. కనీసం మంచి నీరయినా ఇచ్చి ఆర్చుకు పోతున్న గొంతు తడపక పోతారా అని ఎదురు చూసింది. అరచేతిలో ఇమిడిన ఆ శాలువా, బొమ్మ పుచ్చుకుని వెనక్కి తిరిగి చూస్తే తన కుర్చీలో ఎవరో కూర్చొని వున్నారు. పోనీ మైకులో తనను ఎందువల్ల ఆదర్శమహిళగా అందరూ అనుకొంటున్నదీ చెప్పాలీ, థాంక్యూ అనాలనీ అలమేలు అటుగా చూసింది. అప్పటికే మైకును ప్రకటన దారు వనిత ఆక్రమించి మళ్లీ నెంబర్లు చదివేస్తోంది. ఒకటో రౌండు, రెండో రౌండు, జబ్బాలో చీటీలు తిప్పేస్తున్నారు.సన్మాన కారకురాలైన మహిళ అలమేలును వెళ్లి వెనుక వరుసలో కూచోవాలని సైగ చేసింది. అలా చెప్పించుకున్నందుకు అలమేలు 'ఛీ' అనుకొంది. మళ్లీ బహిరంగంగా తన కోపాన్ని గానీ, వ్యధను గానీ బయట పెట్టడం బాగుండదని వెనక్కి వెళ్లి వారు చూపించిన కుర్చీలో కూలబడింది.

ప్రాణం లేని కుర్చీగానే ఆ చోటుని చూస్తూ అందరూ దాటుకుంటూ పోయి బహుమతులు అందుకొంటున్నారు. ఒళ్లు వేడెక్కుతోంది. అలమేలుకు తన డిగ్రీలు, విద్య సాహిత్య రంగాల్లో తన కృషి, సంఘసేవల్లో తన ప్రతిభ ఏవీ వారికి గుర్తుకు రావడం లేదు. ఒక వెయ్యి నూట పదహార్లో పెద్ద జరీ శాలువాను, కనీసం రెండు యాపిల్ పండ్లో, ఒక్క గులాబీ పువ్వో ఏమీ లేని ఈ మొక్కుబడి సన్మానం ఏమిటి. తననెందుకిలా ఫూల్‌ని చేశారు అనే ఆలోచన ఇంత సేపటికి వచ్చింది. వెంటనే లేచి నిలబడింది. స్టేజి మెట్లు దిగి వరుసలుగా ఉన్న టేబిల్సు మధ్య నుంచి నడుచుకుంటూ హాలు చివరికి వచ్చేసింది. నాలుగు అడుగులు వేస్తే బయటికే.

తల తిప్పి పక్కకు చూస్తే టిఫిన్లు, కూల్‌డ్రింకులు, శరవేగాన అందుకుని ఊదేస్తున్నారు మహిళా మణులు. తను స్టేజి మధ్యలో నిలబడటం గానీ, ఎవ్వరూ కనీసం తనను ఆహ్వానించిన ఆమె అయినా గమనించలేదు. బయటికి నడవాలంటే అబ్బాయి వచ్చాడో లేదో... పొగబండి లాంటి తమ కారు ఎక్కడుంచాడో... 'కింకర్తవ్యం' అన్నట్లుగా ఆమె చూస్తోంటే ఒక పదహారు ఏళ్ల యువతి పరిగెత్తుకుంటూ వచ్చి.... "మేడం... మా అమ్మమ్మ మీతో మాట్లాడాలని అన్నదండీ" అంది. ప్రాణం కొంచెం లేచి వచ్చింది అలమేలుకు. వెడల్పాటి నవ్వు మూతి మీదకు తెచ్చుకుని 'ఎవరమ్మా మీ అమ్మమ్మ?" అన్నది. "మీరు నూజివీడులో గుడిపక్కన అరుగుల ఇంట్లోవుండేవారట. మా అమ్మమ్మ ఆగుళ్ళోనే పూజారిగారింట్లో ఉండేదిటండీ!" అంటోంటే ఇంత సందట్లో తనని పట్టించుకున్న ఆ అమ్మమ్మ ప్రాణి ఎవరో అనుకొంది.

ఆ యువతి ఫలహారాల వేపుగా పరుగెత్తింది. ఐదు, పది, పదిహేను నిముషాలు గడిచాయి. అలమేలు నిలబడే వున్నది. అప్పటికి వచ్చింది ఆ పిల్ల.

"మా అమ్మమ్మ కనబడలేదండీ" అంటే అలమేలుకి ఆవేశం వచ్చింది. పౌరుషం వచ్చింది. 'ఛీ, ఛీ, ఛీ' అనుకొంది. ఆ శాలువా, బొమ్మ ఆ పిల్ల చేతిలో పెట్టి స్టేజి మీద ఉన్న ఆర్గనైజరుని చూపింది. "ఆమెకిచ్చేసేయి. మా ఇంట్లో ఇలాంటివి చాలా ఉన్నాయి" అంటూ వెళ్లబోతోంటే ఆర్గనైజరు స్టేజి మీద నుంచే వేగంగా చెయ్యి ఊపి రమ్మంటోంది.

'స్కూలు వార్షికోత్సవంలో ప్రైజు తీసుకోమని హెడ్‌మిసెస్ కుర్ర విద్యార్థినిని పిలుస్తున్నట్టు ఆమె చేయి ఊపుతోంది. తన చేతిలోని శాలువా, బొమ్మ ఏం చేయాలో తోచక ఆ మధ్యవర్తి యువతి దిక్కులు చూస్తోంటే తెగింపుగా ముందుకు నడిచి ఆవరణలోకి వచ్చేసింది అలమేలు. బయట ఎంత వేడిగా వుందో ఆమె మనసులో భగ్గున మండే అవమాన జ్వాల కూడా అంతే ఉష్ణం చిమ్ముతోంది. ఇవి బయట ఎవరికీ కనబడవు. చెట్టు కింద బుద్ధిగా పడి వుంది తన పాత ఫియట్. పాపం అందులో తన పుత్ర రత్నం... ఎవరు తోస్తారో ఆ కారు.